సాక్షి పెద్దపల్లి

సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024



రాజన్నకు భక్తుల తాకిడి

వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో లఘు దర్శనాలు రద్దు చేశారు.



'అమృత్'తో రైల్వేస్టేషన్ అభివృద్ధి

రైల్వేస్టేషన్లలో మెరుగైన వసతులు కల్పించి సేవ లందించాలనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ఆరంభించిన 'అమృత్' పథకం కింద పెద్దపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధికి నోచనుంది.

8లో

గరిష్ఠం/కనిష్ఠం 32.2/24.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి

న్యూస్‌రీల్

మల్లన్నస్వామికి పట్నాలు



పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల: మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీమల్లికార్జునస్వామితో పాటు అనుబంధ ఆలయాలైన సీతరామచంద్ర స్వామి, నందీశ్వరులను దర్శించుకున్నారు. ఒగ్గు పూజారులతో పట్నాలు వేసి బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో సదయ్య, వైస్ చైర్మన్ బత్తుల రమేశ్‌బాబు ఏర్పాట్లు చేశారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. దీంతో ఆయా కేటగిరీలకు చెందిన వారంతా తమతమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పెద్దపల్లి సెలక్షన్ గ్రేడ్ మార్కెట్ చైర్మన్ పదవి ఎస్సీ వర్గానికి రిజర్వు అయింది. సుల్తానాబాద్, మంథని, కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీలు జనరల్ కేటగిరీ, రామగుండం, జూలపల్లి మార్కెట్ బీసీ వర్గానికి రిజర్వు అయ్యాయి. కాగా ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్టీ వర్గానికి రిజర్వు చేశారు.

పెద్దపల్లి చైర్మన్‌గిరీ ఎస్సీ మహిళకేనా?

పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి ఎస్సీ మహిళ (మున్సిపల్ మాజీ కౌన్సిలర్)ను వరించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు ప్రయత్నించిన నేతలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇస్తామని ప్రజాప్రతినిధులు చెబుతున్నా పోటీ తీవ్రస్థాయిలో ఉండడంతో వారిని సముదాయించడం ఎమ్మెల్యేలకు కొంత తలనొప్పిగా మారింది. ఒకే పదవికి పోటీ పెరగడంతో తమను ఎందుకు పట్టించుకోరని సదరు నేతలు గట్టిగానే నిలదీస్తుండడంతో వారిని బుజ్జగించేందుకు ప్రజాప్రతినిధులు పాట్లు పడుతున్నారు.

ఏఈడబ్ల్యూఎస్ వైస్ ప్రెసిడెంట్‌గా వెంకటేశం



యైటింక్లయిన్‌కాలనీ: ఆల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా యైటింక్లయిన్ కాలనీకి చెందిన బాదె వెంకటేశం ఎంపికయ్యారు. ఈ మేరకు ఏఈడబ్ల్యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.శంకర్ ఆదివారం నియామక పత్రం అందజేశారు. వెంకటేశం ఎంపికపై రాష్ట్ర సభ్యులు దాసరి రామస్వామి శుభాకాంక్షలు తెలిపారు. గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బుల్లయ్య పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా

గోదావరిఖని: ఏఐటీయూసీ కృషి ఫలితంగా సింగరేణి కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు అంగీకారం కుదిరిందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. గని ప్రమాదం, బయట జరిగిన ప్రమాదంలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించేదుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందం చేసుకోనున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఏటా రూ.274 అదనంగా చెల్లిస్తే మరో రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు అంగీకరించారని, ఇలా మొత్తం రూ.కోటి 30 లక్షలు అందించనున్నారన్నారు. ఇది కార్మికుల ఘన విజయమన్నారు.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి



నివాళి అర్పిస్తున్న నాయకులు

రామగుండం: అరాచక శక్తులకు అడ్డుకట్ట వేసే క్రమంలో పోరాడి అసువులు బాసిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మేర్గు చంద్రయ్య, పీవైఎల్ రాష్ట్ర నాయకుడు ఆరుముళ్ల తిరుపతి అన్నారు. ఆదివారం అమరులైన కత్తెరమల్ల పోశం, ఆరుముళ్ల భూమన్నల స్తూపం వద్ద నివాళి అర్పించారు. వారి త్యాగాలను కొనియాడారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కృష్ణ, జిల్లా అధ్యక్షుడు నరేశ్, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.విశ్వనాథ్, మల్లేశ్, రమేశ్, ఆనంద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నెర్రెబారుతున్నాయి..!



'ఈఫొటోలో నీరు లేక వెలవెలబోతూ కనిపిస్తున్న చెరువు జూలపల్లి మండలం తెలుకుంట గ్రామంలోనిది. దీని కింద సుమారు 500 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. ఎస్సారెస్పీ నీటితో చెరువులు నిండుతాయని, సాగుకు ఢోకా ఉండదని ఆయకట్టు రైతులు పంటలు సాగు చేశారు. ఇప్పుడే చెరువు ఎండిపోవడంతో సాగు ప్రశ్నార్థకంగా మారిందని వాపోతున్నారు. ఇలాగే ఇదే మండలంలోని పెద్దాపూర్ పెద్ద చెరువు, వడ్కాపూర్ చెరువులు అడుగంటి వెలవెలబోతున్నాయి. దీంతో వీటి కింద సాగు చేసిన సుమారు 2వేల ఎకరాల వరి ఎండిపోతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు'.

- అడుగంటుతున్న జలాలు.. ఎండుతున్న పంటలు
- వారబందీతో చివరి ఆయకట్టుకు చేరని నీరు
- సాగునీరు లేక నెర్రెలు బారుతున్న వరి పొలాలు
- తడుల కోసం అన్నదాతల కష్టాలు



మంథనిలోని కాకర్లపల్లి శివారులో నెర్రెలు బారిన పొలాలు

సాక్షి, పెద్దపల్లి: ఏటా జిల్లాలో పంట చివరిదశలో నీటి కష్టాలతో అన్నదాతలు ఇబ్బందులు పడేవారు. కానీ ఈయేడాది పంట మొదట్లోనే ఆయకట్టుకు నీరందక పంటలు ఎండిపోతున్నాయి. ఎండలు మండకముందే భూగర్భజలాలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. పంటలను కాపాడేందుకు ఏం చేయాలో తెలియక రైతులు దిక్కులు చూస్తున్నారు. ఈఏడాది కురిసిన భారీ వర్షాలకు తోడుగా, ఎస్సారెస్పీ కాలువల పూడికతీత, ముళ్లపొదల తొలగింపుతో చివరి ఆయకట్టుకు నీళ్లు అందుతాయన్న ఆశతో అన్నదాతలు పంటలు సాగు చేశారు. జిల్లాలో యాసంగిలో మొత్తం 2,27,595 ఎకరాల్లో పంటలు సాగు చేస్తుండగా అందులో 2,00,320 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. నీరు లేక ఎండిపోతుండటంతో, పెట్టుబడులు సైతం రాలేని పరిస్థితులున్నాయని వాపోతున్నారు.

వారబందీతో ఆగమాగం

జిల్లాలో ఎస్సారెస్పీ డీ–83 పరిధిలో 1,03,339 ఎకరాలు (ధర్మారం, జూలపల్లి, పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, రామగుండం, మంథని, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, రామగిరి, ఎలిగేడు మండలాలు). డీ–86 పరిధిలో 89,660 ఎకరాల (జూలపల్లి, ధర్మారం, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లో) ఆయకట్టు విస్తీర్ణం ఉంది. ఆయకట్టుకు డీ–83, డీ–86 కాలువల కింద నీటిని వారబందీ పద్ధతిలో విడుదల చేస్తున్నారు. 8 రోజులు ఆన్, 7 రోజులు ఆఫ్ ప్రాతిపదికన విడుదల చేస్తున్నారు. అయితే, ఎస్సారెస్పీ నీటిని కాలువ మొదటిభాగంలో ఉన్న గ్రామాల రైతులు మోటార్ల ద్వారా తోడేస్తున్నారు. దీంతో ప్రధానంగా కాల్వశ్రీరాంపూర్, ఓదెల, ముత్తారం, మంథని తదితర మండలాల్లోని చివరి ఆయకట్టు గ్రామాలకు నీరు అందక పొలాలు ఎండుతున్నాయి.



నీటి చుక్క లేకుండా వట్టిపోయిన ముత్తారంలోని డీ83 కెనాల్

శ్రీరాంసాగర్ నీటితో నింపితేనే..

ప్రస్తుతం ఎస్సారెస్పీలో 35.03 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వారబందీలో మార్చి 31 వరకు రోజూ 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో చివరి ఆయకట్టు పొలాలకు నీరు అందడం లేదు. అలాగే మరోపక్క 20.17టీఎంసీల సామర్థ్యం గల ఎల్లంపల్లిలో ప్రస్తుతం 11టీఎంసీల నీరు మాత్రమే ఉంది. గతేడాదితో పోల్చితే 8టీఎంసీలు తక్కువగా ఉంది. ఎత్తిపోతల్లో భాగంగా ఎల్లంపల్లి నుంచి నీటిని పంపింగ్ ద్వారా గుండారంకు తరలించి, అక్కడి నుంచి మంథని నియోజకవర్గంలోని మండలాలకు నీరు అందించేవారు. ఈఏడాది అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల నీటిని లీకేజీలతో దిగువకు వదిలివేయాల్సి వచ్చింది. దీంతో నీరు ఎత్తిపోయకపోవడంతో గుండారం రిజర్వాయర్‌కు నీరు రాక చివరి ఆయకట్టు పొలాలు ఎండుతున్నాయి. ఎస్సారెస్పీ ద్వారా చెరువులు నింపితేనే గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి నీటి ఇబ్బందులు తప్పే అవకాశం ఉంది. కాలువ నీటిని ఎక్కువ మోతాదులో వదిలితే చెరువుల్లోకి, చివరి ఆయకట్టుకు నీరు చేరే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

బావి ఎండిపోయింది



నాకున్న రెండెకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేసిన. ఎస్సారెస్పీ నీళ్లు రాకపోవడంతో కాలువల్లో నీరు లేక బావిలో నీరు ఎండిపోయింది. నీటి తడులు లేక పొలం అంతా నెర్రెలుబారింది. పెట్టిన పెట్టుబడి మొత్తం కొట్టుకుపోయినట్లే.

– ఉప్పు శ్రీనివాస్, రైతు, ఇప్పలపల్లి

చెరువులు నింపాలి



పెద్దాపూర్ చెరువును శ్రీరాంసాగర్ నీటితో నింపాలి. ఇప్పటికే తూము ద్వారా పొలాలకు నీరు రావడంలేదు. మరో వారమైతే పొలాలు ఎండిపోయే అవకాశం ఉంది. వెంటనే అధికారులు కాలువ నీటితో చెరువును నింపేందుకు చర్యలు తీసుకోవాలి.

– నేరెల్ల శ్రీనివాస్, రైతు, పెద్దాపూర్

చివరి భూములకు అందడం లేదు



చెరువుల్లో నీరు ఉంటేనే భూగర్భ జలాలు పెరిగి బావుల్లో నీరు ఉంటది. లేకుంటే బావులపై ఆధారపడి సాగు చేసిన పంటలు ఎండిపోయే అవకాశం ఉంది. వారబందీలో నీరు ఇస్తే చివరి భూములకు అందడం లేదు. ఇప్పటికే చిన్న కుంటలు ఎండి పోయినయి. వెంటనే ఎస్సారెస్పీ నీటితో చెరువులు నింపాలి.

– నాడెం మల్లారెడ్డి, రైతు, జూలపల్లి

మోదీతోనే దేశం అభివృద్ధి



రామగిరిలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా

- కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా

పెద్దపల్లిరూరల్/రామగిరి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోనే దేశం అభివృద్ధి చెందుతోందని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా అన్నారు. బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్ర ఐదో రోజు పెద్దపల్లి జిల్లాకేంద్రంతో పాటు రామగిరి మండలంలో కొనసాగింది. రామగిరి మండలం సెంటనరీకాలనీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్టికల్ 370 రద్దు చేసి జమ్మూకాశ్మీర్‌కు విముక్తి కల్పించిన ఘనత మోదీదన్నారు. రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా కేంద్రప్రభుత్వం చేసిన అభివృద్ధే కనిపిస్తోందన్నారు. మోదీ నాయకత్వాన్ని మరో సారి బలపర్చాలని కోరారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. జిల్లాకేంద్రంలోని జెండాకూడలి వద్ద మాట్లాడుతూ.. సాంకేతిక, విజ్ఞానరంగాల్లోనూ దేశం దూసుకుపోతోందన్నారు. మోసపూరిత హామీలతో ప్రజలను దగా చేసే కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కుటుంబం, వారసత్వ రాజకీయాలకు పాల్పడే కాంగ్రెస్‌వాదులు.. అధికారంలో ఉన్నన్ని రోజులు అవినీతి కుంభకోణాలకు పాల్పడ్డారని విమర్శించారు. యాత్రలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, ఎస్సీ మోర్చా నాయకులు ఎస్.కుమార్, కందుల సంధ్యారాణి, మచ్చగిరి రాము, ముల్మూరి శ్రీనివాస్, పొన్నం సదానందం, తొట్ల రాజుయాదవ్, తీగల శ్రీధర్, కొప్పు భాషా,రాంనాథ్ పాల్గొన్నారు.

బైక్‌ర్యాలీ

పెద్దపల్లి మండలం సబ్బితం వద్ద పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రవేశించిన విజయసంకల్పయాత్రకు నియోజకవర్గ నాయకులు స్వాగతం పలికారు. అక్కడ నుంచి బైక్‌ర్యాలీగా రంగాపూర్, రాఘవాపూర్ మీదుగా పెద్దపల్లికి చేరుకుంది. రాఘవాపూర్ వద్ద బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు చిలారపు పర్వతాలుయాదవ్ ఆధ్వర్యంలో డోల్‌దెబ్బకళాకారులు స్వాగతం పలికారు. వారి విన్యాసాలకు ఆకర్షితుడైన మంత్రి డోల్ తీసుకుని వాయించి ఉత్సాహం నింపారు.

'గుజ్జుల' వర్గం దూరం

పెద్దపల్లి నియోజకవర్గంలో ఆదివారం కేంద్ర మంత్రి హాజరైన విజయసంకల్ప యాత్రకు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి వర్గీయులు దూరంగా ఉన్నారు. బీజేపీ నాయకుడు రాజారాం సింగ్ అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆయన వర్గీయులు కేంద్రమంత్రి హాజరైన కార్యక్రమానికి దూరంగా ఉండడం గమనార్హం. అయితే తమకు ఎవరూ కార్యక్రమ వివరాల సమాచారాన్ని అందివ్వడం లేదని పార్టీ సీనియర్ నాయకుడొకరు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నేతల మధ్య సమన్వయం లేకపోవడంతో నియోజకవర్గంలో పార్టీ రోజురోజుకు దిగజారే పరిస్థితులే కనిపిస్తున్నాయని వాపోయారు. పార్టీ అధిష్ఠానం చొరవ చూపాల్సిన అవసరముందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

రూపాలాను కలిసిన జీఎంలు

కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాలాను ఆదివారం సెంటనరీకాలనీ అతిథి గృహంలో ఏపీఏ, ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎంలు కె.వెంకటేశ్వర్లు, ఎస్.రాధాకృష్ణలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ఏరియా సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పల్లెలకు పక్కా రోడ్లు

- జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.40.33కోట్లు మంజూరు

పెద్దపల్లిరూరల్: పల్లెల్లో ఉన్న మట్టి రోడ్లు మాయం కానున్నాయి. ఊరూరా సిమెంట్ రోడ్లను నిర్మించేందుకు వీలుగా జిల్లాలో రూ. 40.33 కోట్లతో 431 అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చాలా కాలంగా మట్టి రోడ్లతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు కావడాన్ని హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్ల పనులను నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

పెద్దపల్లి నియోజకవర్గంలో..

పెద్దపల్లి మండలంలో రూ.2.25 కోట్లతో 31 సీసీ రోడ్లను నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. జూలపల్లి మండలంలో రూ.95లక్షలతో 16 పనులు, సుల్తానాబాద్‌లో రూ.కోటి 85లక్షలతో 29 పనులు, ఓదెలలో రూ,కోటి 85లక్షలతో 21 సీసీ రోడ్లు, శ్రీరాంపూర్‌లో రూ.కోటిన్నర నిధులతో 24 పనులు, ఎలిగేడు మండలంలో రూ.కోటి 20లక్షలతో 16 సీసీ రోడ్లను నిర్మిచనున్నట్లు తెలిపారు.


మంథని సెగ్మెంట్‌లో..

మంథని మండలంలో రూ.8.17కోట్లతో 88 సీసీరోడ్లు, కమాన్‌పూర్‌లో రూ.2.1కోట్లతో 30 పనులు, రామగిరిలో రూ.4.98 కోట్లతో 51పనులు, ముత్తారంలో రూ.6.55కోట్లతో 65 సీసీరోడ్లు నిర్మాణం కానున్నాయి.

రామగుండంలో..

అంతర్గాం మండలంలో రూ.2.63కోట్లతో 12 పనులు, పాలకుర్తిలో రూ.3.79కోట్లతో 24 సీసీరోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ధర్మారం మండలంలో రూ.2కోట్ల60లక్షలతో 24సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు.

పల్లెల్లో సీసీ రోడ్ల నిర్మాణం



గ్రామీణ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సిమెంట్ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. పనులు నాణ్యతగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించాం.

– విజయరమణారావు, ఎమ్మెల్యే, పెద్దపల్లి

రామగుండంకు రూ.126 కోట్ల కేటాయింపు హర్షణీయం



సీఎం, మంత్రి, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

గోదావరిఖని: గత పాలకులు రామగుండం ప్రాంతాన్ని నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి విమర్శించారు. రామగుండం కార్పొరేషన్‌కు రూ.126కోట్లు కేటాయించడాన్ని హర్షిస్తూ ఆదివారం ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి నిధుల నుంచి రూ.10కోట్లు, డీఎంఎఫ్‌టీ నుంచి రూ.16 కోట్లు, మున్సిపల్ గ్రాంట్స్ క్రింద రూ.100కోట్లు మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్యను తొలగించేందుకు, రామగుండంకు పూర్వవైభవం తీసుకవచ్చేందుకు ఎమ్మెల్యే ప్రయత్నం చేస్తున్నాడని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాల్వ లింగస్వామి, ఎండీ ముస్తాఫా, పెద్దెల్లి ప్రకాశ్, పాతిపెల్లి రవి, పెండ్యాల మహేశ్, రాజేశ్, గట్ల రమేశ్, యుగంధర్, చుక్కల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నదిపై మరో వంతెన

- మంథని–శివ్వారం మధ్య బ్రిడ్జి నిర్మాణానికి రూ.125 కోట్లు మంజూరు
- రెండు జిల్లాలకు తగ్గనున్న దూరం
- వ్యాపార, వాణిజ్య అభివృద్ధికి అవకాశం



ఈ ఫొటోలోని రైతు పేరు సంగం దామోదర్. ఇతనికి మంచిర్యాల జిల్లా చెన్నూరు సమీపంలోని కొమ్మెర సమీపంలో పది ఎకరాల పంట భూములున్నాయి. అన్నదమ్ములంతా మంథనిలో నివాసం ఏర్పర్చుకున్నారు. దామోదర్ మంథనిలో పాన్‌షాప్ నిర్వహిన్నాడు. మంథని నుంచి 70 కిలోమీటర్లు వెళ్లి వ్యవసాయం చేయడం ఇబ్బందిగా ఉండటంతో తన భూములను అక్కడి రైతులకు కౌలుకు ఇచ్చాడు. మంథని వద్ద గోదావరి నదిపై వంతెన పూర్తయితే సొంతంగా వ్యవసాయం చేసుకుంటామని దామోదర్ తెలిపారు. ఇలా అనేక మంది రైతులు మంథనితో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఉన్నారు.



మంథని వద్ద గోదావరి నదిపై నిర్మించే వంతెన ప్రాంతం

మంథని: గోదావరి నదిపై మరో హైలెవల్ వంతెనకు మోక్షం కలిగింది. కాళేశ్వరం వద్ద అంతర్ రాష్ట్ర వంతెన.. గోదావరిఖని వద్ద రెండు జిల్లాల వారధితో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బ్యారేజీ, వంతనలు ఇప్పటికే ఉపయోగంలో ఉన్నాయి. అంతేగాకుండా గ్రీన్ ఫీల్డ్ హైవేలో భాగంగా మంథని మండలం విలోచవరం సమీపంలో వంతెన నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. తాజాగా జిల్లాలోని మంథని సమీపంలోని గోదావరి వద్ద హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.125 కోట్ల మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు జారీ చేసింది.

తగ్గనున్న దూరభారం

మంథని సమీపంలోని గోదావరి వద్ద వంతెన నిర్మాణం కోసం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందు మంథని వద్ద గోదావరి నది దాటి మంచిర్యాల జిల్లా శివ్వారం వైపు ఉన్న శివ్వారం, పొనూరు, వేలాల, సోమన్‌పల్లికి చెందిన అనేక మంది రాకపోకలు సాగించే వారు. ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరిలో నీటి ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిచిపోయి ఇబ్బంది పడుతున్నారు. అటు వైపు వెళ్లాలంటే బస్సు మార్గమైతే గోదావరిఖని, ఇందారం, టేకుమట్ల, శెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్ మీదుగా వేలాల, పొనూరు, శివ్వారం చేరుకుంటున్నారు. అలా సుమారు 60–70 కిలో మీటర్లు ప్రయాణిస్తున్నారు. అలాగే చెన్నూర్‌కు గోదావరిఖని, జైపూర్ మీదుగా ప్రయాణం చేస్తున్నారు. వంతెన నిర్మాణం చేపడితే మంథని నుంచి శివ్వారం ఆరు కిలో మీటర్లు, చెన్నూర్ 26 కిలో మీటర్లు మాత్రమే ఉంటుంది. రెండు జిల్లాలకు చెందిన అనేక మంది రైతులు తమ పంట పొలాలు మంచిర్యాల జిల్లా వైపు వెళ్లేందుకు దూరభారం తగ్గుతుంది.

జాతీయ రహదారులకు అనుసంధానం

గోదావరిపై మరో వంతెన నిర్మాణం పూర్తయితే మంచిర్యాల–పెద్దపల్లిల జిల్లాలకు ప్రధానమైన చెన్నూరుకు దూరం తగ్గడమే కాకుండా జాతీయ రహదారులకు సమీపంలోనే అనుసంధానం జరుగనుంది. అంతర్ రాష్ట్ర వంతెన నిజామాబాద్–జగ్దల్‌పూల్ జాతీయ రహదారి కేవలం 25 కిలో మీటర్ల దూరమే ఉంటుంది. అలాగే కొత్తగా నిర్మిస్తున్న గ్రీన్ ఫిల్డ్ హైవేకు పది కిలో మీటర్ల మధ్యలోనే వంతెన నిర్మాణం జరుగుతోంది. అలా రెండు జాతీయ రహదారులకు మధ్యలో గోదావరి నదిపై మంథని–శివ్వారం వంతెనకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో వ్యాపార, వాణిజ్య సంబంధాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

పుణ్యక్షేత్రానికి సమీపంలోనే..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మంచిర్యాల జిల్లా వేలాలలో మల్లన్న ఆలయంలో వైభవంగా ఉత్సవాలు జరుగుతాయి. ఈ వేడుకలకు పెద్దపల్లి జిల్లా నుంచి వేలాది మంది భక్తులు తరలివెళ్తారు. వంతెన పూర్తయితే మంథని నుంచి వేలాల కేవలం ఆరు కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. దీంతో పుణ్యక్షేత్రానికి జిల్లా నుంచి భక్తులు పెరిగే అవకాశం ఉంది.

రాకపోకలు పెరుగుతాయి



మంథని వద్ద గోదావరి నదిపై వంతెన నిర్మాణంతో రెండు జిల్లాల మధ్య రాకపోకలు పెరుగుతాయి. చెన్నూరు కంటే మంథని దగ్గరగా అవుతుంది. వివిధ అవసరాలకు ఇక్కడికే వచ్చే వీలుంటుంది. సమయం, దూరం కలిసి వస్తుంది. వంతెన నిర్మాణానికి మంత్రి శ్రీధర్ బాబు చొరవ ప్రశంసనీయం.

– చెరుకు తిరుపతిరెడ్డి, సోమన్‌పల్లి, చెన్నూర్ మండలం

పది నిమిషాల్లో వెళ్లొచ్చు



ప్రస్తుతం ఏదైన అవసరం పడితే మంచిర్యాల, చెన్నూరు ప్రాంతాలకు వెళ్తున్న. వంతెన పూర్తయితే మంథనికి పది నిమిషాల్లో వెళ్లే వీలు కలుగుతుంది. మా గ్రామానికి మంథని కేవలం ఆరు కిలోమీటర్లే ఉంటుంది. ప్రస్తుతం సుమారు 30 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తుంది.

– ఆయిందాల సాయికుమార్, వేలాల, మంచిర్యాల జిల్లా

క్లుప్తంగా

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య


మధునమ్మ (ఫైల్)

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలంలోని లక్ష్మాజిపల్లిలో ఓ వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మాజిపల్లికి చెందిన కోడూరి మధునమ్మ (70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నా ఆరోగ్యం బాగు కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉదయం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు సదానందం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్: మంత్రాలు వస్తాయంటూ ఓ మహిళను చంపుతానని బెదిరించిన వ్యక్తిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన సంకుటాల జలపతి అదే గ్రామానికి చెందిన అమృత అనే మహిళ ఇంటికి వెళ్లి తన కూతురుకు మంత్రాలు చేస్తున్నావని, అందుకే అమె ఆరోగ్యం సరిగా ఉండడం లేదని ఇంటి తలుపులు పగులగొట్టాడు. అసభ్య పదజాలంతో దూషిస్తూ చంపుతానని బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జలపతిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


అశోక్ మృతదేహం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌కు చెందిన పస్తం అశోక్ (27) యువకుడు శనివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పస్తం అశోక్‌కు వివాహం కాగా.. భార్యతో మనస్పర్థలు రావడంతో కొంతకాలంగా విడిగా ఉంటున్నాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది చైతన్యపురికాలనీ శివారులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి నాలుగేళ్ల కూతురు ఉంది. మృతుడి సోదరుడు పస్తం సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ తెలిపారు.

కొడుకు పెళ్లికావడం లేదని తల్లి ఆత్మహత్య

సిరిసిల్లక్రైం: కొడుకుకు పెళ్లి సంబంధాలు కుదరడం లేదని మానసికంగా కుంగిపోయిన తల్లి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన సిరిసిల్లలో ఆదివారం విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాలు. జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన చిప్ప శారదకు పెళ్లీడుకొచ్చిన కొడుకు ఉన్నాడు. ఎన్ని సంబంధాలు వెదికినా పెళ్లి కుదరడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని మృతిచెందింది. మృతురాలి భర్త దేవదాసు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల సీఐ రఘుపతి తెలిపారు.

ఎరువుల దుకాణం సీజ్

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్‌లో మహేంద్ర సీడ్స్, ఫర్టిలైజర్ షాపును సీజ్ చేసినట్లు ఏవో యోగితా ఆదివారం తెలిపారు. దుకాణం లైసెన్స్ గడువు ముగిసినప్పటికి రెన్యూవల్ చేసుకోలేదని, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంతో సీజ్ చేశామని పేర్కొన్నారు.

మామిడికి 'తేనెమంచు పురుగు'

- వాతావరణ మార్పులే కారణమంటున్న శాస్త్రవేత్తలు
- పురుగుమందులు పిచికారీ చేస్తున్నా ఉధృతంగానే...
- 80 శాతం మామిడి తోటలకు నష్టం


తేనెమంచు పురుగుతో నల్లగా మారిన పూత

జగిత్యాలఅగ్రికల్చర్: ఈ ఏడాది మామిడి పూతను చూసి మురిసిపోయిన రైతన్నకు ఆదిలోనే తేనె మంచు పురుగుతో కష్టాలు మొదలయ్యాయి. ఆదాయం రావడం దేవుడెరుగు.. తోటలకు రసాయన మందులు పిచికారీ చేసేందుకే రైతులు రూ.వేలు ఖర్చు పెడుతున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో మూడేళ్లుగా మామిడి రైతులకు తేనెమంచు పురుగులు చుక్కలు చూపిస్తున్నాయి. ఈ ఏడాది మరింత దెబ్బతీస్తోంది. ఇప్పటికే దాదాపు 80శాతం మామిడి తోటల్లో ఈ పురుగు ఆశించి 100 శాతం పంటకు నష్టం జరిగింది.

పూతను పీల్చేస్తున్న తేనెమంచు పురుగు

ఈ పురుగులు వాతావరణ మార్పులకు లోనై మామిడి పూతను ఆశిస్తాయి. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉండటంతో ఎక్కువగా తేనెమంచు పురుగు ఆశిస్తుంది. ఈ పురుగులు గుంపులుగుంపులుగా మామిడి పూత, పిందెపై చేరి, వాటి నుంచి రసాన్ని పీల్చుతుంటాయి. ఫలితంగా పూత, పిందె రాలి మాడిపోతుంటాయి. ఈ పురుగులు విసర్జించిన తేనెలాంటి పదార్థంపై మసి కారణమైన శిలీంద్రాలు పెరిగి, ఆకులు, పూత, పిందెలపై నల్లని మసిగా ఏర్పడుతుంది. ఈ పురుగు ఉధృతికి మామిడి తోటల్లో కలుపు మొక్కలు ఎక్కువగా ఉండటం.. వాతావరణం మబ్బుగా ఉండటం.. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండటం.. ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు ఈ పురుగు తన ప్రతాపాన్ని చూపిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ పురుగు వల్ల దాదాపు 20 నుంచి 100 శాతం వరకు నష్టం ఏర్పడుతుంది.

పురుగు మందుల పిచికారీ

తేనెమంచు పురుగు కట్టడికి రైతులు రసాయన మందులను విపరీతంగా పిచికారీ చేస్తున్నారు. ఇప్పటికే ఒక్కోరైతు కనీసం రెండుమూడు సార్లు పిచికారీ చేశారు. అయినా పూత మాత్రం నిలవలేదు. ఎకరం తోట పిచికారీ చేసేందుకు కూలీలు, రసాయన మందులకు కలిపి రూ.20వేల వరకు ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు. తోటలను లీజుకు తీసుకున్న వ్యాపారులు ప్రస్తుతం తోటలను చూసి తమ అడ్వాన్స్ తమకు ఇవ్వాలని రైతులను బతిమిలాడే పరిస్థితి నెలకొంది. పూతలు ఎండిపోవడమే కాక కొన్నిచోట్ల చెట్టంతా నల్లగా మారిపోయాయి.

రైతుల ఆశలు ఆవిరి

మామిడితోటలు రెండేళ్ల నుంచి నష్టపరుస్తున్నాయి. ఆదాయం కూడా అంతంతమాత్రంగానే ఉంది. ఈ ఏడాది పూత చూసి ఆదాయం వస్తుందనుకున్నా.. రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఇప్పటికే రైతులు ఒక్కో ఎకరానికి రూ.25వేల వరకు ఖర్చు పెట్టారు. తేనెమంచు పురుగు వదలకపోవడంతో అయోమయంలో పడుతున్నారు.

రెండుసార్లు పిచికారీ



వాతావరణ మార్పులతో మామిడితోటల నుంచి ఆశించిన ఆదాయం రావడం లేదు. పూత ప్రారంభానికి ముందు, పూత వచ్చిన తర్వాత కూడా రసాయన మందులు పిచికారీ చేశాను. వాటికే ఎకరాకు రూ.30 వేల వరకు ఖర్చయ్యింది. అయినా పూత సరిగ్గా నిలవలేదు.

– నక్కల రవీందర్‌రెడ్డి, అంతర్గాం, జగిత్యాల రూరల్ మండలం

తేమ పెరగడంతోనే



వాతావరణంలో తేమశాతం పెరుగుతోంది. వర్షాలు అక్టోబర్ వరకు కురిశాయి. వరిసాగు పెరగడం ద్వారా ఆ పంటకు నీటి వినియోగం అధికంగా ఉంటుంది. దాంతో గాలిలో తేమ శాతం పెరుగుతుంది. దాని ప్రభావం మామిడి పూతపై పడుతోంది.

– ప్రతాప్‌సింగ్, ఉద్యానశాఖాధికారి, జగిత్యాల

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- ఏసీపీ ప్రతాప్


పోటీలు ప్రారంభిస్తున్న ఏసీపీ ప్రతాప్ తదితరులు


పోటీలకు హాజరైన క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: ప్రస్తుత కాలంలో విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, తాను కూడా ఈ పొజిషన్‌లో ఉన్నానంటే క్రీడలే ప్రధాన కారణమని కరీంనగర్ ఏసీపీ ప్రతాప్ అన్నారు. కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్స్‌లో ఆదివారం ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్ ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి తెలంగాణ రాష్ట్రస్థాయి కుంగ్ ఫూ కరాటే పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలపై ఆసక్తి పెంచుకునేందుకు కృషి చేస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. మార్షల్ ఆర్ట్స్ లాంటి యుద్ధ క్రీడను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని, ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో మార్షల్ ఆర్ట్స్‌కు కంచుకోట కరీంనగర్ అన్నారు. అనంతరం పలు విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బంగారు, రజత, కాంస్య పతకాలను ఏసీపీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ, తదితర అతిథులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ, పోటీల నిర్వాహకులు, ఇన్‌స్ట్రక్టర్ ఎ.శ్రీనివాస్, టీఎస్జీవోల సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, అత్యాపత్యా క్రీడా సంఘం అధ్యక్షుడు చీటి రామారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.సంజీవ్‌రెడ్డి, ప్రొఫెసర్ మల్లారెడ్డి, ఫండస్ స్కూల్ డైరెక్టర్ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్ట్రక్టర్‌లు సురభి వేణుగోపాల్, బార విద్యాసాగర్, కోడూరి శేఖర్, లింగమూర్తి, మొయిన్, రవివర్మ, అన్వర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు వృత్తి ప్రమాణాలు పెంపొందిస్తాం

- సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు
- తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్: జర్నలిస్టుల వృత్తి ప్రమాణాలు పెంపొందించడమే లక్ష్యంగా ప్రెస్ అకాడమీ పనిచేస్తుందని, జిల్లా, మండల స్థాయిల్లో జర్నలిస్టులకు శిక్షణ, సదస్సులు, సెమినార్లు నిర్వహిస్తూ మీడియా మరింత పరిణితి చెందేలా చొరవ చూపుతుందని తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని ఓ సమావేశానికి వచ్చిన ఆయన.. మీడియాతో మాట్లాడారు. చైర్మన్‌గా తనను నియమించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలపై ఐదారేళ్లుగా రేవంత్‌రెడ్డి నిశితంగా పరిశీలిస్తున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిష్కరించేందుకు కృషి చేస్తానని గతంలో పలుమార్లు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నివేశన స్థలాలు, హెల్త్‌కార్డుల జారీ తదితర సమస్యలు మొదటి ప్రాధాన్యత ఉండేలా మీడియా అకాడమీ ప్రయత్నిస్తుందని తెలిపారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా.. కార్యదర్శిగా పనిచేసిన అనుభవాన్ని.. ప్రస్తుత పరిస్థితులను జోడించి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదిస్తానని స్పష్టం చేశారు. ఆయన నియామకం సందర్భంగా కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు అభినందించారు.

వీధికుక్కల స్వైర విహారం

- నలుగురు పిల్లలపై దాడి
- భయాందోళనలో ప్రజలు


గాయపడిన మహవీర్‌సింగ్(3)


గాయపడిన కాట మోక్షిత్ గౌడ్(4)

రామగిరి: మండలంలోని ఆయా గ్రామాల్లో వీధికుక్కలు రెచ్చిపోతున్నాయి. చిన్న పిల్లలు, పెద్దవాళ్లు అనే తేడా లేకుండా దాడి చేస్తున్నాయి. మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం నలుగురు పిల్లలను గాయపర్చాయి. వివరాల్లోకి వెళ్తే.. కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని కృష్ణానగర్‌లో నివాసముంటున్న అనిక్‌సింగ్–లక్ష్మణ్ సింగ్‌ల కుమారుడు మహవీర్ సింగ్(3) అమ్మతో కలిసి ఉన్నాడు. ఒక్కసారిగా మూడు కుక్కలు దాడి చేయడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. అలాగే ఆరెల్లి ఝాన్సీ–సదానందం కుమారుడు అశ్విత్(15) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం స్పెషల్ క్లాస్‌ల నిమిత్తం పాఠశాలకు వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా కుక్కలు దాడి చేయడంతో గాయాలపాలయ్యాడు. పాతవాడ పరిధిలోని కాట శ్యామల–శ్రీనివాస్ కుమారుడు కాట మోక్షిత్‌గౌడ్(4) ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. శివాలయం వీధికి చెందిన కొలిపాక ప్రవళిక–సతీశ్ దంపతుల కుమార్తె శాన్విక(4) ఆరుబయట నిల్చుని ఉండగా కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. గ్రామంతో వీధికుక్కలు ఎక్కువయ్యాయని స్థానికులు వాపోతున్నారు. దీంతో రోడ్లపైకి ఒంటరిగా రాలేని పరిస్థితులు ఏర్పడ్డాయని, వెంటనే కుక్కల దాడులను అరికట్టడానికి నియంత్రణ చర్యలు తీసుకోవాలని ప్రజలు స్థానిక అధికారులను కోరుతున్నారు.

శ్రీపాదరావుకు అరుదైన గౌరవం


శ్రీపాదరావు(ఫైల్)

మంథని: మాజీ స్పీకర్, దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావుకు రాష్ట్ర ప్రభుత్వం అరుదైన గౌరవం కల్పించింది. ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 2న శ్రీపాదరావు జయంతిని స్టేట్ ఫంక్షన్‌గా నిర్వహించాలని ఆయా జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శ్రీపాదరావు మంథని నియోజకవర్గం నుంచి 1983 నుంచి మూడుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ హయాంలో శాసన సభ స్పీకర్‌గా పనిచేశారు. ఆయన మరణానంతరం వారసుడిగా రాజకీయ అరగ్రేటం చేసిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి.. ప్రస్తుతం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. శ్రీపాదరావు జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా ఉత్తర్వులు రావడంపై నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

కొండగట్టు మెట్లదారిలో గుర్తు తెలియని మృతదేహం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న గుట్టపైకి వెళ్లే మార్గంలోని మెట్లదారి వద్ద ఆదివారం గుర్తు తెలియని మృతదేహం కనిపించింది. ఆ దారి మీదుగా వెళ్తున్న కొంతమంది భక్తులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. దారిలోని ఓ చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని, సుమారు 25 ఏళ్లు ఉంటాయని పోలీసులు తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'అమృత్'తో పెద్దపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి

- రూ.26.49 కోట్లతో ఆధునీకరణ పనులు
- మారనున్న రైల్వేస్టేషన్ రూపురేఖలు
- నేడు ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా పనులు ఆరంభం


పెద్దపల్లి రైల్వే స్టేషన్

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం రైల్వేస్టేషన్లను ఆధునీకరించడంతో పాటు అండర్‌పాస్, ఆర్‌ఓబీల సమస్యలను దూరం చేసి ప్రజలకు మెరుగైన వసతులను కల్పించి సేవలందించాలనే ఆలోచనతో ఆరంభించిన ‘అమృత్’ పథకం కింద పెద్దపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధికి నోచనుంది. ఈ పథకం కింద పెద్దపల్లి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులకోసం రూ.26.49 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ పనులను సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిన ప్రారంభించనున్నారు. రైల్వేశాఖ అధికారులు పెద్దపల్లిలో ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

మారనున్న రూపురేఖలు

పెద్దపల్లి రైల్వేస్టేషన్ నుంచి షిర్డీ, వారణాసి, తిరుపతి లాంటి పుణ్యక్షేత్రాలతో పాటు పలు రాష్ట్రాలకు వెళ్లేందుకు అవసరమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుతున్నారు. దీంతో పెరుగుతున్న ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్రప్రభుత్వం అమృత్ పథకం కింద పెద్దపల్లి రైల్వేస్టేషన్ ఎంపిక కావడంతో రూ.26.49 కోట్ల వ్యయ అంచనాలతో చేపట్టిన పనులు పూర్తయితే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. పెద్దపల్లి జంక్షన్ విస్తరణ పనులను అధికారులు నిర్ణయించారు.

చీకురాయి వద్ద టౌన్ రైల్వేస్టేషన్

ఖాజీపేట–బల్లార్ష సెక్షన్ ప్రధాన రైలు మార్గం కావడంతో ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లతో పాటు సూపర్ ఫాస్ట్, గూడ్స్ రైళ్లు ఈ మార్గంలో ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. పెద్దపల్లి జంక్షన్ స్టేషన్‌లో గూడ్స్ రైళ్లు, పాసింజర్ రైళ్లను నిలపడం ఇబ్బందిగా మారిన కారణంగా సమీపంలోని చీకురాయి వద్ద జంక్షన్ ఏర్పాటు చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కొద్దినెలల క్రితం అందుకు అవసరమైన స్థలాలను సైతం గుర్తించేందుకు ఆర్డీఓ మధుమోహన్ రైతులతో సమావేశాన్ని కూడా నిర్వహించారు.

చేపట్టే పనులు

- ప్రయాణికుల కోసం షెడ్ల నిర్మాణం. నాల్గో ప్లాట్‌ఫాం ఏర్పాటు.
- ఫుట్‌ఓవర్ బ్రిడ్జితో పాటు రెండు లిఫ్టులు, ఎస్కలేటర్ సౌకర్యం.
- రైళ్ల కోసం నిరీక్షించేందుకు అవసరమైన వెయిటింగ్ హాల్, ఏసీ వెయిటింగ్ హాల్‌ను విశాలంగా నిర్మాణం.
- ప్లాట్‌ఫాంలకిరువైపులా టాయిలెట్ల నిర్మాణం.
- టికెట్ బుకింగ్ కౌంటర్ ఆధునీకరించడం.
- మరో ఆటో టికెట్ వెండింగ్ మిషన్ ఏర్పాటు.
- రైల్వేస్టేషన్ ముందు భాగంలో ఆకర్షణీయ నిర్మాణాలు.

జాతర హుండీల లెక్కింపులో వివాదం


పోలీస్‌స్టేషన్‌లో భద్రపర్చిన హుండీలు

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి జరిగిన సమ్మక్క సారలమ్మ జాతర హుండీ లెక్కింపు ప్రక్రియ వివాదానికి దారితీసింది. దీంతో బసంత్‌నగర్ ఎస్సై స్వామి హుండీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. ఈసాలతక్కళ్లపల్లి, కొత్తపల్లి, రామారావుపల్లి గ్రామాల ఆధ్వర్యంలో రెండేళ్లకోసారి జాతర కొనసాగుతోంది. జాతర ద్వారా వచ్చే ఆదాయంలో 50శాతం ఈసాలతక్కళ్లపల్లికి, 25శాతం కొత్తపల్లికి, 25శాతం రామారావుపల్లికి చెల్లించే విధంగా గతంలో గ్రామ పెద్దమనుషులు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఈయేడు జాతర ప్రారంభానికి ముందే మూడు గ్రామాల మధ్య జాతర నిర్వహణ విషయమై వివాదం నెలకొంది. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆదేశాల మేరకు బసంత్‌నగర్ ఎస్సై స్వామి మూడు గ్రామాల పెద్ద మనుషులను సమన్వయపర్చి జాతరను ప్రశాంతంగా నిర్వహింపజేశారు. శనివారం దేవతల వనప్రవేశం అనంతరం హుండీలను జాతర ప్రాంగణంలోని దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో భద్రపర్చి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించేందుకు మూడు గ్రామాల పెద్దలు అంగీకారం తెలిపారు. అయితే తాము జాతరను వేలం ద్వారా దక్కించుకున్నామని, వేలం పాట ద్వారా వచ్చిన డబ్బులను మాత్రమే మూడు గ్రామాలు వాటాలుగా పంచుకోవాలే తప్ప హుండీల డబ్బులు మాత్రం ఇవ్వడం కుదరదని ఈసాలతక్కళ్లపల్లికి చెందిన ఓ వర్గం తేల్చి చెప్పడంతో వివాదం నెలకొంది. జాతర నిర్వహణకు వేలం పెట్టడం ఏంటని, నిర్వహణ ఖర్చులు పోగా మిగిలిన డబ్బులన్నీ సౌకర్యాల ఏర్పాటుకు వెచ్చించాలని మిగతా వారు కోరారు. ఇరువర్గాలను శాంతింపచేసేందుకు ఎస్సై స్వామి ప్రయత్నించారు. వివాదం సద్దుమణుగకపోవడంతో హుండీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సోమవారం ఎండోమెంట్ అధికారుల సమక్షంలో హుండీల ఆదాయం లెక్కింపు ప్రక్రియ చేపడుతామని తెలిపారు.

ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిపై కేసు

చొప్పదండి: ప్లాటును మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడగా, అతడి భార్య ఫిర్యాదు మేరకు చొప్పదండి పోలీసులు ఒకరిపై కేసు నమోదు చేశారు. ఎస్సై ఉపేంద్రచారి కథనం ప్రకారం.. వీణవంక మండలం కనపర్తి గ్రామానికి చెందిన ముదుగంటి రఘుపతికి ఆదిలాబాద్ జిల్లా రెబ్బెన మండలం చిలుకమీదిగూడ గ్రామానికి చెందిన మానసతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు అమ్మాయిలు యూకేజీ, ఎల్‌కేజీ చదువుతున్నారు. సీడ్ కంపెనీలో పని చేసే రఘుపతి తాను కిరాయికి నివాసం ఉండే పడకంటి కృష్ణ వద్ద రూ.30 వేలు అప్పు తీసుకున్నాడు. అధిక వడ్డీ కట్టలేక చొప్పదండి పట్టణంలోని 2 గుంటల ప్లాటును కృష్ణకు మార్టిగేజ్ చేశాడు. ఈ విషయాన్ని భార్యతో తరుచూ చెప్పుకుంటూ బాధపడ్డాడు. మనస్తాపంతో ఈ నెల 19న క్రిమిసంహారక మందు తాగి ఇంటికి వచ్చాడు. ఇంటి యజమాని బాధలు భరించలేక క్రిమిసంహారక మందు తాగానని భార్యతో చెప్పగా, 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రతిమ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కృష్ణ మోసం చేయడంతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని రఘుపతి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కంప్రెషర్ వాహనం సీజ్

జమ్మికుంట(హుజూరాబాద్): అనుమతి లేకుండా కంప్రెషర్ వాహనంతో బావిలో బ్లాస్టింగ్ చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి ఆదివారం తెలిపారు. మండలంలోని నాగంపేట గ్రామంలో ఓ వ్యవసాయ బావిలో కరీంనగర్‌కు చెందిన వేముల వెంకట్ కంప్రెషర్ వాహనంతో బ్లాస్టింగ్ చేస్తున్న సమయంలో గస్తీ పోలీసులు పట్టుకొని వాహనాన్ని సీజ్ చేశారు. జిలెటిన్‌స్టిక్స్ వైరు, రెండు డిటోనేటర్లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ పేర్కొన్నారు.

జాతరలో పోగొట్టుకున్న సొమ్ము అందజేత


బాధితురాలికి అందజేస్తున్న సొమ్ము

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంటలో జరిగిన సమ్మక్క సారలమ్మ జాతరలో పోగొట్టుకున్న బంగారం, నగదును నిజాయితీగా పోలీసు అధికారుల సమక్షంలో అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన కొమురోజు కమల కుటుంబీకులతో కలిసి సమ్మక్క జాతరకు తుర్కలమద్దికుంటకు వచ్చింది. జాతరలో రెండు తులాల బంగారం, రూ.3వేల నగదు పోగొట్టుకుంది. ఆ సొమ్ము తుర్కలమద్దికుంటకు చెందిన చల్లోజు కవితకు దొరికింది. ఆ సొమ్మును నిజాయితీగా సీఐ కృష్ణ, ఎస్సై సుధాకర్‌రావు, మల్లేశ్‌లకు అప్పగించింది. పోగొట్టుకున్న బాధితురాలిని గుర్తించి జాతర కమిటీ చైర్మన్ ముత్యాల రాజయ్య, వైస్‌చైర్మన్ నర్సయ్య గ్రామపెద్దల సమక్షంలో ఆదివారం అప్పగించారు. కవిత నిజాయితీని పలువురు అభినందించారు.

తండ్రిపై తనయుడి దాడి

సారంగాపూర్: ఆస్తి విషయంలో తండ్రిపై తనయుడు దాడి చేసిన సంఘటన బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధి నర్సింహులపల్లెలో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆడెపు చంద్రయ్యకు ఇద్దరు కుమారులు. చంద్రయ్య ముంబయిలో ఉన్న ఇంటిని ఇతరులకు విక్రయించి.. వచ్చిన డబ్బులను ఇద్దరు కుమారులకు సమానంగా పంచాడు. కొంత తన వద్ద ఉంచుకున్నాడు. ఇంటిని కొన్నవారి పేరున రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని చిన్న కుమారుడు సత్తయ్యను కోరగా.. అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోపంతో తండ్రిని కట్టెతో చితకబాదాడు. చంద్రయ్య ఫిర్యాదు మేరకు సత్తయ్యపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


కొమ్ము గట్టయ్య

జ్యోతినగర్: ఈనెల 26నుంచి 29వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 67వ రాష్ట్రస్థాయి అండర్ 14 క్రికెట్ పోటీలకు రాంచర్ల అశ్రిత్ ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ జిల్లా కార్యదర్శి కొమ్ము గట్టయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది సెంటినరీకాలనీలో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడన్నారు. ఎంపికైన అశ్రిత్‌ను స్కూల్ హెచ్‌ఎం ఫాదర్ డామ్నిక్, పీఈటీ సుదేశ్, శ్యాం, టీచర్స్ అభినందించారు.